సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



ముగిసిన కబడ్డీ పోటీలు

రాజంపేటలో ఇన్‌ఫ్యాంట్ జీసస్ హైస్కూల్‌లో గత నెల 28వ తేదీ నుంచి ప్రారంభమైన 67వ జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. -IIలో



సైన్స్ ఫెయిర్‌లో మొదటి స్థానం

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ పోటీలో బి.కొత్తకోట మండలం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలవిద్యార్థి సామతోటి రోహిత్ మొదటి స్థానం సాధించాడు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 155 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	470
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 606.900 కిలోలు

న్యూస్‌రీల్

6న బహిరంగ వేలం

సిద్దవటం: మహా శివరాత్రి ఉత్సవాల్లో శ్రీనిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల పోగు హక్కు కోసం ఈనెల 6వ తేదీ మంగళవారం బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ కోండారెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దవటంలోని శ్రీరంగనాయక స్వామి ఆలయంలో 6వ తేదీ ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. నిత్యపూజా స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు 2024 మార్చి 7వ తేదీ నుంచి 2024 మార్చి 9వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటాదారుడు ధరావత్తు కింద లక్ష రూపాయలు చెల్లించాలన్నారు. వేలం పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటాదారుని ధరావత్తు మినహా మిగిలిన వారి ధరావత్తు నగదును తిరిగి ఇస్తామని చెప్పారు.

సీఐల బదిలీలు

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న ఎం.రామభూపాల్, బి.మనోహర్, కొట్టం దస్తగిరిలను కడప వీఆర్‌కు ఎస్పీ బి.కృష్ణారావు గురువారం బదిలీ చేశారు. పి.ఉమామహేశ్వరరావును అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోనే సోషియల్ మీడియా, సైబర్ క్రైమ్ సెల్ విభాగాలకు ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులలో ఎస్పీ పేర్కొన్నారు.

నేడు 'స్టాఫ్ నర్స్' నియామకాల కౌన్సెలింగ్

కడప రూరల్: వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామకాల కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. మొత్తం 67 మందికి రాయలసీమ జిల్లాల పరిధిలో నియామకాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ఇది వరకే ఎంపికైన అభ్యర్థులకు పంపామని తెలిపారు.


వెబ్‌సైట్ ప్రారంభం



లీగల్‌సెల్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం లీగల్ సెల్ వెబ్‌సైట్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ గురువారం రిజిస్ట్రార్, లీగల్ సెల్ చైర్మన్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ సత్వర న్యాయ పరిష్కారాల కోసం సమాయత్త వేదికగా ఈ వెబ్‌సైట్ పనిచేస్తుందన్నారు. విశ్వవిద్యాలయానికి సంబంధించి దాఖలైన కోర్టు కేసులను లీగల్‌సెల్ పర్యవేక్షిస్తుందన్నారు. రాష్ట్రస్థాయి లీగల్ కమిటీ, స్టాండింగ్ కౌన్సెల్‌తో సంప్రదించి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌కు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటీ అండ్ నెట్‌వర్కింగ్ సెల్ డైరెక్టర్ ఆచార్య టి. శివప్రతాప్, ఆచార్య ఎం.వి.శంకర్, లీగల్‌సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.వి.జయంత్ కశ్యప్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.శివారెడ్డి, కో కన్వీనర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 45 ఎక్స్‌ప్రెస్ బస్సులు



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఖాళీ జాగాలు పరిశీలిస్తున్న డీపీటీవో రాము

పీలేరురూరల్: ఈ నెల 15 లోపు జిల్లాకు 45 ఎక్స్‌ప్రెస్ బస్సులు, అల్ట్రా డీలక్స్ బస్సులు వస్తున్నట్లు డీపీటీవో రాము అన్నారు. గురువారం పీలేరు ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15.60 ఎకరాల భూమి పీలేరు డిపోలో ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారికి 5 సంవత్సరాలు, 15 సంవత్సరాల కాల వ్యవధితో అద్దెకు ఇవ్వనున్నట్లు చెప్పారు. పీలేరు డిపోకు నాలుగు కొత్త ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఇస్తున్నట్లు తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డిపోల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బస్సుల కండీషన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ, బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, ఏడీసీలు హనీఫ్, బాబు నాయక్, యూనియన్ నాయకులు రాజు, సీవీ. రమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తధనమేదీ..



- కడప-బెంగళూరుకు రూ.10లక్షలు
- కంభం-ప్రొద్దుటూరుకు రూ.1000
- మధ్యంతర బడ్జెట్‌లో రైల్వేపరంగా జిల్లాకు మొండిచేయి



కడప-బెంగళూరు రైలుమార్గం

రాజంపేట: పార్లమెంట్‌లో గురువారం కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వేల పురోగతి ఎన్ని'కల'గా మిగిలిపోయింది. ఈ బడ్జెట్‌లో అన్ని విధాలుగా కేంద్రం మొండి చేయి చూపింది. ఉభయ జిల్లాలకు సంబంధించి కొత్తలైన్లు లేవు..కొత్త రైళ్లు పట్టాలు ఎక్కించలేదు. ప్రతిపాదనలో ఉన్న పొడిగింపురైళ్లు కూడా దూరమయ్యాయి. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అనగానే రొటీన్ బడ్జెట్ తరహాలోనే ఉభయజిల్లా రైల్వేలో కేటాయింపులు అరకొరగానే ఉంటాయని రైలు ప్రయాణీకులు భావించారు. అదే జరిగిందని పెదవివిరిస్తున్నారు. కడప నుంచి కమలాపురం రోడ్డు ఎల్‌సీ 120 గేటు ఆర్వోబీ నిర్మాణానికి రూ,కోటి నిధులు మంజూరు చేశారు.

కడప-బెంగళూరు లైనుకు రూ.10లక్షలు

కడప-బెంగళూరు రైల్వేలైన్‌కు మధ్యంతర బడ్జెట్‌లో రూ.10లక్షలు మాత్రమే కేటాయించారు. ఈ లైను ముందుకుసాగే పరిస్థితులు లేవని నిధుల కేటాయింపును బట్టి తెలుస్తోంది. 2008-2009 లో రూ,3,040 కోట్ల వ్యయంతో ఈ రైల్వేలైన్‌ను చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తితో నిధులు అందచేసి ప్రాజెక్టు పూర్తి చేయాలన్నది ఆనాటి ఒప్పందం. ఈ మేరకు పెండ్లిమర్రి వరకు లైను వేశారు.

కంభం-ప్రొద్దుటూరు లైన్ రూ.1000 మాత్రమే

ఎన్‌డీఏ ప్రభుత్వం హయాంలో ఆవిర్భవించిన కొత్త రైలుమార్గం కంభం-ప్రొద్దుటూరు రైల్వేలైన్ సర్వే దశలో ఉండిపోయింది. మోదీ ప్రధాని అయిన తర్వాత సర్వే కోసం బడ్జెట్‌లో నిధులు ప్రకటించారు. ఈ రైల్వేలైన్ సర్వే కోసం ఆర్‌వీఎన్‌ఎల్ గతంలో టెండర్లను కూడా పిలిచింది. 2015 రైల్వే బడ్జెట్‌లో కంభం-ప్రొద్దుటూరు కొత్తరైల్వేలైన్ కోసం రూ.10లక్షలు కేటాయించారు. అయితే దీని అంచనా వ్యయం రూ. 829కోట్లు కాగా దూరం 142కి.మీ ఉందని రైల్వే వర్గాల సమాచారం. 2016లో రైల్వే బడ్జెట్‌లో రూ.కోటి వ్యయం చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో వెయ్యిరూపాయిలు కేటాయించారు. దీంతో దీనిని అందుబాటులోకి తీసుకొస్తారనేది ప్రశ్నార్థకరంగా మారింది. యూపీఏ సర్కారు హయాంలో మంజూరు భాకరాపేట-గిద్దలూరు రైల్వేలైన్‌ను ఆటకెక్కించేశారు.

నందలూరుకు న్యూ రైల్వే రన్నింగ్‌రూం..

ఉభయ జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో న్యూ రైల్వేరన్నింగ్‌రూం నిర్మాణం కోసం రైల్వే బడ్జెట్‌లో రూ.3.32 కోటి మంజూరు చేశారు. గతంలో కోటి వ్యయంతో ఏసీ రన్నింగ్‌రూం కేటాయించి, పనులు చేపట్టి మధ్యలో ఆపేశారు.

నందలూరు ప్రాముఖ్యతను గుర్తించారు



నందలూరు రైల్వేకేంద్రం ప్రాముఖ్యతను ఇప్పటికైనా రైల్వేశాఖ గుర్తించింది. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నందలూరులో న్యూ రన్నింగ్‌రూం నిర్మాణం చేపడతామని ప్రకటించడం అభినందనీయం. **-మేడా రఘునాథరెడ్డి, అధినేత, ఎమ్మార్‌కేఆర్ సంస్థ, నందలూరు**

రన్నింగ్‌రూం నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్



ఉభయ జిల్లాలో రైల్వే అంటే నందలూరు. అలాంటి నందలూరుకు బడ్జెట్‌లో న్యూ రన్నింగ్‌రూం నిర్మించేందుకు నిధులు కేటాయించారు. గతంలో నందలూరుకు మంజూరైన ఏసీ రన్నింగ్ రూంను తరలించేశారు. మళ్లీ న్యూ రన్నింగ్ రూం నిర్మాణానికి బడ్జెట్ గ్రీన్‌సిగ్నల్ పడింది. **- అరిగె మణి, వైఎస్సార్‌సీపీ కాపునేత, నందలూరు**

జిల్లాకు ప్రతిసారి మొండిచేయి



జిల్లాకు రైల్వేపరంగా ప్రతిసారి బడ్జెట్‌లో మొండి చేయి చూపుతున్నారు. ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైలుమార్గం ఉన్నా ఇప్పటి వరకు ఒక రైలును నడపలేదు. కొత్త రైలుమార్గాలు సర్వేకు పరిమితమయ్యాయి. నందలూరులో ప్రత్యామ్నాయ రైల్వేపరిశ్రమను మంజూరు చేయలేదు. **-రవినాయుడు, ప్రయాణీకుడు, రాజంపేట**

మధ్యంతరంపై మిశ్రమం

కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



వైవీయూ: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన లభించింది. వ్యవసాయం, పారిశ్రామికరంగం, గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కోసం మరింత బడ్జెట్ కేటాయింపులు ఉంటే బాగుండేదని కొందరు పేర్కొనగా, టాక్స్‌పేయర్స్‌కు మరోసారి నిరాశ తప్పలేదని ఉద్యోగులు అంటున్నారు, యువత, మహిళాసాధికారతకు దోహదం చేసేలా బడ్జెట్ ఉందని మరికొందరు అభిప్రాయ పడ్డారు.

గ్రామీణాభివృద్ధికి నిధులు కేటాయించాలి



మధ్యంతర బడ్జెట్ కాబట్టి ఉన్నంతలో ఫర్వాలేదనిపించేలా బడ్జెట్ ఉంది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగం, మౌలిక సదుపాయాలకు కేటాయించిన బడ్జెట్ మరింత ఎక్కువగా ఉంటే బాగుండేది. రక్షణ రంగానికి నిధులు కేటాయించడం దేశభద్రతకు భరోసా ఇచ్చేదే అయినప్పటికీ గ్రామీణ భారత అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించి ఉంటే మరింత ఆశాజనకంగా ఉండేది.
– డాక్టర్ బీదం విజయ్‌కుమార్, ఆర్థికశాఖ ఉపన్యాసకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

వికసిత్ భారత్ లక్ష్యసాధన దిశగా..



మధ్యంతర బడ్జెట్‌లో దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేలా బడ్జెట్ రూపకల్పన చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని పూర్తి చేసి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టడం హర్షణీయం. పన్ను స్లాబ్‌లలో ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేకపోవడం నిరాశాజనకం. యువత, మహిళా సాధికారత సాధించేందుకు దోహదం చేసేలా బడ్జెట్ ఉంది. **- డాక్టర్ జి.విజయలక్ష్మి, ఆర్థికశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప**

వేతన జీవులకు నిరాశ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది. స్టాండర్డ్ డిడక్షన్స్, స్లాబ్‌లలో ఎలాంటి మార్పులు చేయకపోవడం బాధాకరం.హౌసింగ్ లోన్, ఆరోగ్యకరమైన అంశాల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడం దారుణం. కేంద్రం పొదుపులు ప్రోత్సహించే విధంగా సెక్షన్ 80-సి పరిధిని విస్తరించకపోవడంతో ఉద్యోగ వర్గాలకు న్యాయం జరగలేదు. **-ఆర్వీ రమణ, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి**

రాష్ట్రానికి అన్యాయమే



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. మన రాష్ట్రానికి సంబంధించిన ఎలాంటి ప్రతిపాదనలు లేవు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించే విషయం గానీ, పోలవరం నిర్వాసితుల విషయం,, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీల ప్రస్తావన వంటి అంశాలు బడ్జెట్లో లేకపోవడం విచారకరం. ప్రజావ్యతిరేక బడ్జెట్‌ని ప్రజలు వ్యతిరేకించాలి. **- పి.శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శి**

పింఛనానందం

రాయచోటి: ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, విశ్వసనీయతను చాటుకుంటూ నూతన ఏడాదిలో రెండో నెల వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా అందించే పింఛన్ రూ. 3 వేలను లబ్ధిదారులు ఉత్సాహంగా అందుకుంటున్నారు. గురువారం అన్నమయ్య జిల్లా పరిధిలోని అన్ని మండలాలలో పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రారంభించారు. పెన్షన్ అందుకుంటున్న వృద్ధులు, వికలాంగులు,ఇతర లబ్ధిదారుల కళ్లలో ఆనందం తొణికిసలాడుతోంది. జిల్లా పరిధిలో 226916 మందికి రూ. 67.35 కోట్ల పెన్షన్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఫిబ్రవరి ఒకటో తేది రాత్రి 8 గంటల వరకు 191341 మందికి రూ. 3 వేలు వంతున రూ. 56.76 కోట్లను అందజేశారు. మిగిలిన వారికి కూడా రెండు మూడు రోజుల్లో అందజేస్తామని ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, అసిస్టెంట్ పీడీ ధర్మరాజులు తెలిపారు.



రుయా ఆసుపత్రిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ప్రశాంత్

వలంటీర్ మానవత్వం

తంబళ్లపల్లె: మండలంలోని ఎర్రసానిపల్లెకు చెందిన రెడ్డిలక్ష్మీ రోడ్డు ప్రమాదంలో గాయపడింది. తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. మూలపల్లెకు చెందిన గ్రామవలంటీర్ ప్రశాంత్ ఆమె పరిస్థితిని తెలుసుకుని మానవత్వంతో గురువారం తిరుపతికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందజేశారు.

వేగంగా ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని జిల్లాలోని సచివాలయాల్లో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. గురువారం రెవెన్యూ రీ సర్వే మూడో దశ, ఇనామ్, అసైన్డ్ భూములు, స్త్రీ శిశు సంక్షేమం-ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ పథకం, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్షించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ అన్ని విభాగాలపై సమీక్షించారు. ముఖ్యంగా చుక్కల భూములు, ఇనాం భూములను మార్గదర్శకాల మేరకు పరిష్కరించాలని సూచించారు. అలాగే జిల్లాలో నిర్వహించనున్న పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

కలెక్టరేట్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కలెక్టరేట్‌ను, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిషిక్త్ కిషోర్ గురువారం కలెక్టర్ కార్యాలయంలోని అన్ని విభాగాలను, అందులో పని చేస్తున్న ఉద్యోగులను పేరు పేరునా పలుకరించారు. ఈ సందర్భంగా వారి విధులతో పాటు రికార్డుల తయారు, భద్రపరిచే విధానాలపై ఆరా తీసి వాటిని పరిశీలించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో సమయపాలనను పాటించాలన్నారు. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చిన ప్రజలకు గౌరవం ఇచ్చి వారి పనులను పూర్తి చేయించాలని సూచించారు.

తీపి గుమ్మడి.. లాభాల సవ్వడి

- కొత్తరకం వాణిజ్య పంటను సాగు చేస్తున్న రైతులు
- ఉత్తరాది రాష్ట్రాల్లో విపరీతమైన డిమాండ్
- ఎకరాకు రూ.2 లక్షల వరకు లాభం
- పంటకాలం తక్కువ.. పెట్టుబడికి ఢోకా ఉండదు



తంబళ్లపల్లె మండలం మర్రిమాకులపల్లె వద్ద సాగు చేసిన తీపి గుమ్మడి కాయల తోట



లారీలో గుమ్మడిని లోడింగ్ చేస్తున్న కార్మికులు

మదనపల్లె సిటీ/తంబళ్లపల్లె: వినూత్న ఆలోచనలతో కొత్త పంటలు పండిస్తూ రైతన్నలు లాభాలు గడిస్తున్నారు. ముఖ్యంగా పడమటి ప్రాంతాల వారు ఇటీవల వాణిజ్య పంటయిన తీపి గుమ్మడి సాగును ఎంచుకున్నారు. దీంతో లాభాలు పండి రైతుకు ఊరట కలిగింది. ఈ ఏడాది తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో పలువురు రైతులు సుమారు 65 ఎక రాల్లో గుమ్మడి సాగు చేశారు. ఈ పంట 110 రోజు ల్లో కోతకు వచ్చి ఆదాయం చేతికి అందుతుంది.

ఎకరానికి రూ.20- రూ.25వేలు ఖర్చు

తీపి గుమ్మడి పంట సాగుకు ఎకరానికి దక్కులు దున్నడం నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎకరానికి అరకిలో విత్తనాలు సరిపోతాయి. మొలకలు కాకుండా విత్తనాలను నేరుగా దుక్కిలో నాటడం సులభమవుతుంది. పూత దశ నుంచి కాయల పరిమాణం పెరిగే వరకు చీడపీడల బారిన పడకుండా రైతులు గుర్తిస్తూ వెంటనే మందులు పిచికారి చేస్తే మంచి దిగుబడి వస్తుంది. 110 రోజుల్లో పంట చేతికి అందుతుంది.

ఎకరానికి 15 టన్నుల వరకు దిగుబడి

భూమిని సారవంతం చేసే విధానం, వాతావరణ అనుకూలతకు బట్టి తీపి గుమ్మడికాయలు ఎకరానికి 10 నుంచి 15 టన్నుల దిగుబడినిస్తాయి. కాయ 5 కిలోల నుంచి 12 కిలోల వరకు బరువు పెరుగుతుంది. పంట మొత్తం ఒకేసారి కోతకు వస్తుంది. నికరంగా రైతుకు ఎకరానికి లక్ష నుంచి రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది.

టన్ను రూ.13 నుంచి 16 వేలు

తీపి గుమ్మడి కాయలకు ఉత్తరాది రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉండటంతో ప్రస్తుతం టన్ను కాయ నాణ్యతను బట్టి రూ.13 నుంచి రూ.16 వేల వరకు ధరలు పలుకుతున్నాయి.

పొలాల వద్దకే వ్యాపారులు

తీపి గుమ్మడికి మంచి డిమాండ్ ఉండటంతో వ్యాపారులు నేరుగా పొలాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో ప్యాకింగ్ చేసి తరలిస్తున్నారు.

తంబళ్లపల్లె టు ఆగ్రా

తంబళ్లపల్లె నియోజకవర్గంలో పండించిన తీపి గుమ్మడి దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి. ప్రధానంగా ఈ గుమ్మడి తమిళనాడు, కేరళ, కర్నాటకతో పాటు ఢిల్లీ, అగ్రా, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడ పండించిన తీపి గుమ్మడికి ఈ ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ ప్రాంతాల్లో హల్వా, కేసరి, సాంబారు తయారీకి వీటిని ఎక్కువగా వాడుతారు. వీటితో పాటు పలు స్వీట్లలో కూడా తీపిగుమ్మడి ముక్కలు వాడుతారు.

రెండేళ్లుగా సాగు చేస్తున్నా



తీపి గుమ్మడికాయల సాగు రెండేళ్లుగా సాగు చేస్తున్నా. ఎకరాకు రూ.20 వేల నుంచి 25 వేలు ఖర్చు వస్తుంది. మిగతా పంటల సాగుతో పోలిస్తే ఈ పంట సాగు శ్రమ తక్కువ. చీడపీడల బాధ ఉండదు. నికరమైన ఆదాయం చేతికి వస్తుంది. **-రవీంద్రారెడ్డి, రైతు, మర్రిమాకులపల్లె, తంబళ్లపల్లె మండలం**

పెట్టుబడికి ఢోకా ఉండదు



తీపి గుమ్మడి పంట సాగుకు పెట్టుబడి ఖర్చు నష్టపోయే అవకాశం ఉండదు. మార్కెట్‌లో ధర ఉంటే మంచి ఆదాయం వస్తుంది. రెండేళ్లుగా గుమ్మడి సాగు చేస్తున్నా. రైతులు పంట మార్పిడితో వాణిజ్యపంటలైన ఇలాంటి పంటలు సాగు చేస్తే నష్టాలు రావు. **-సహదేవ, రైతు, దండువారిపల్లె, తంబళ్లపల్లె మండలం**

వాణిజ్య పంటలపై మొగ్గు చూపాలి



టమటా సాగుచేసి మార్కెట్ ధరలు పడిపోయినప్పుడు నష్టపోయే కంటే ఇతర వాణిజ్య పంటలపై రైతులు మొగ్గు చూపాలి. గుమ్మడి, దోస, కర్బూజ, కీర వంటి పంటలతో పాటు తీగ జాతి కూరగాయల పంటలు సాగుచేసినా తక్కువ ఖర్చుతో నికరమైన ఆదాయం పొందవచ్చు. **-భీమేష్, ఉద్యానవనశాఖ అధికారి, తంబళ్లపల్లె**

నేటి నుంచి దర్గా స్వామీజీ ఆరాధనోత్సవాలు



దర్గాలో వెలసిన శ్రీ సద్గురు దర్గా స్వామిజీ(ఫైల్)

రామాపురం: మండల పరిధిలోని నీలకంఠ్రావుపేట సమీపంలో వెలసిన శ్రీ దర్బారు సమర్థ సద్గురు దర్గా స్వామిజీ ఆరాధన ఉత్సవాలు శుక్రవారం నుంచి జరగనున్నాయి. ఈ విషయాన్ని నిర్వాహకులు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం గంగపూజ, కలశస్థాపన, పుణ్యాహవచనం , రుద్రాభిషేకం, మంగళహారతి, శనివారం ఉదయం కలశపూజ , సద్గురు పూజ, రుద్రాభిషేకం జరుగుతాయి. సాయంత్రం మెరవణి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవానికి భక్తులందరూ హాజరు కావాలని కోరారు.

ఆర్డీఓ మురళి రివర్షన్ ఉత్తర్వులు తాత్కాలిక నిలుపుదల

మదనపల్లె: ప్రకాశం జిల్లాలో ఆర్డీఓగా పనిచేస్తున్న సమయంలో భూములకు సంబంధించి కన్వర్షన్ విషయంలో ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ జారీచేసిన ఉత్తర్వులపై విచారణలో భాగంగా ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.ఎస్.మురళీని తహసీల్దార్‌గా రివర్షన్ చేస్తూ తేదీ.17. 1.24న జీఓఆర్‌టినెంబర్.46 విడుదల చేశారు. దీనిపై ఆర్డీఓ మంగళగిరిలోని సీసీఎల్‌ఏ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో అప్పీల్ చేసుకున్నారు. విచారించిన వారు ప్రాథమిక దర్యాప్తులో ఆర్డర్‌లో ఎలాంటి ఆధారాలు లేనందున రివర్షన్ ఉత్తర్వులను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ జనవరి 31న జీ.ఓ.ఆర్.టీ.నెం.130 ద్వారా ఉత్తర్వులు వచ్చాయని సబ్ కలెక్టరేట్ డీఏఓ శేషయ్య తెలిపారు.

అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం చంద్రాకాలనీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 2024–25 సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వసుంధరదేవి తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయన్నారు. పూర్తిగా ఇంగ్లీషు మీడియంలో బోధన ఉంటుందన్నారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి ఈ విద్యా సంవత్సరంలో నాల్గవ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ విద్యా సంవత్సరం పదో తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా నివసించేవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది ప్రవేశాలకు మార్చి 10వ తేదీ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఇందుకు ఆన్‌లైన్‌లో www. apbragcet.apcfss.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

పెద్దమండ్యం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పాపేపల్లె పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లెకు చెందిన నూర్ సాహెబ్ కుమారుడు టోపీసాబ్ (20) స్థానిక డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. గతనెల 28న గురివిరెడ్డిగారిపల్లె నుంచి కలిచెర్లకు వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. 108 ద్వారా మదనపల్లెకు బాధితుడిని తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి పోస్టుమార్టం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు


కప్ కైవసం చేసుకున్న హర్యానా క్రీడాకారులతో ఆకేపాటి, పోలా


రన్నర్స్‌గా నిలిచిన రాజస్థాన్ జట్టు

- హర్యానా దూకుడుకు కళ్లెం వేయలేకపోయిన రాజస్థాన్
- భారీ పాయింట్ల ఆధిక్యంతో కప్‌ను కైవసం చేసుకున్న హర్యానా
- రెండవ స్థానానికి పరిమితమైన రాజస్థాన్


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో గత నెల 28వ తేదీ నుంచి ప్రారంభమైన 67వ జాతీయ స్థాయి అండర్–14 బాలికల కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీల ముగింపు రోజు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించారు. సెమీఫైనల్స్‌లో హర్యానా–ఉత్తరప్రదేశ్ జట్లు తలపడగా హర్యానా 22 పాయింట్ల ఆధిక్యతతో ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. అలాగే రాజస్థాన్–మహారాష్ట్ర మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ ఆద్యంతం నువ్వా, నేనా అన్న విధంగా సాగి ప్రేక్షకుల్లో ఉత్కంఠత నెలకొల్పింది. చివరికి రాజస్థాన్ నాలుగు పాయింట్ల తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. తొలి నుంచి రాజస్థాన్, హర్యానా జట్లు దూకుడుగా ఆడుతూ విజయం సాధించడంతో రెండు జట్ల మధ్య పోరు రసవత్తరంగా ఉంటుందని పట్టణంలోని అనేక మంది ప్రజలు ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు పెద్దఎత్తున క్రీడా ప్రాంగణానికి చేరుకున్నారు. రాజస్థాన్ జట్టు ఫైనల్‌కు చేరుకోవడం వల్ల పట్టణంలో ఉన్న రాజస్థాన్ వ్యాపారులు కూడా మ్యాచ్‌ను తిలకించేందుకు భారీగా తరలి వచ్చారు. అయితే ఫైనల్ మ్యాచ్‌లో హర్యానా తొలి కూత నుంచే దూకుడుగా ఆడి పాయింట్లు సాధిస్తూ వచ్చింది. మ్యాచ్ ఆద్యంతం హర్యానా దూకుడుగా ఆడటంతో రాజస్థాన్ క్రీడాకారులు ఏ దశలోను హర్యానా క్రీడాకారుల జోరుకు అడ్డుకట్ట వేయలేక చేతులెత్తేశారు. ఇరుజట్లకు సంబంధించి కూతకు ఎవరు వెళ్లినా హర్యానా జట్టే పాయింట్లు సాధించడంతో స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. ఫస్టాఫ్‌లో హర్యానా 24 పాయింట్లు చేయగా, రాజస్థాన్ కేవలం 3 పాయింట్లు మాత్రమే చేసింది. సెకండ్ హాఫ్‌లో కూడా హర్యానా అదే జోరును కొనసాగించి రాజస్థాన్‌పై 42 పాయింట్ల తేడాతో భారీ విజయాన్ని చేజిక్కించుకొని కప్‌ను కైవసం చేసుకుంది. కాగా మూడవ స్థానం కోసం సెమీఫైనల్‌లో ఓడిపోయిన ఉత్తరప్రదేశ్–మహారాష్ట్ర జట్ల మధ్య పోరు ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. నిర్ణీత 30 నిమిషాల్లో మహారాష్ట్ర 53 పాయింట్లు చేయగా, ఉత్తర్‌ప్రదేశ్ 49 పాయింట్లు చేసింది. దీంతో మహారాష్ట్ర ఉత్తర్‌ప్రదేశ్‌పై 4 పాయింట్ల తేడాతో విజయం సాధించి మూడో స్థానంలో నిలిచింది. బెస్ట్ డిఫెండర్ అవార్డును హర్యానాకు చెందిన సాక్షి, బెస్ట్ రైడర్ అవార్డును రాజస్థాన్‌కు చెందిన రవీనాలు కైవసం చేసుకున్నారు.

క్రీడలకు పెద్దపీట వేస్తున్న సీఎం – ఆకేపాటి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు ఆకేపాటి, పోలా చేతుల మీదుగా కప్‌లను, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల వల్ల అనేక మంది గ్రామీణ క్రీడాకారులు తమలోని ప్రతిభను గుర్తించగలిగారని వారు తెలిపారు. కబడ్డీ పోటీలు విజయవంతం అయ్యేందుకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి వసంత, ఇతర అధికారులు, పీడీలు, పీఈటీలు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్య, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయబోర్డు సలహాదారు జీపీ రెడ్డి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి వసంత, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కమిషనర్ రాంబాబు, రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల ఎంఈఓలు

హార్సిలీహిల్స్ అడవిలో మూడు చిరుతలు ప్రత్యక్షం

- భయకంపితులైన పర్యాటకశాఖ సిబ్బంది
- ఆందోళనలో పర్యాటకులు

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అడవిలో బుధవారం సాయంత్రం నుంచి కొన్ని గంటల వ్యవధిలో ఘాట్‌రోడ్డును దాటుతూ మూడు చిరుతలు ప్రత్యక్షం కావడంతో పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. విధి నిర్వహణలో ఉన్న పర్యాటకశాఖ సిబ్బంది ఈ చిరుతలను చూసి భయకంపితులయ్యారు. ప్రత్యక్షసాక్షులైన టూరిజం సిబ్బంది కథనం మేరకు వివరాలు. హార్సిలీహిల్స్‌పై టూరిజం స్విమ్మింగ్ పూల్‌లో సురేష్ విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఆరు గంటలయ్యాక స్విమ్మింగ్ పూల్ మూసివేసి ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై ఘాట్‌రోడ్డు దిగుతున్నాడు. ఆరున్నర గంటల సమయంలో గంగోత్రి దాటాక కొద్ది దూరంలో ఓ చిరుత ఎడమ వైపు కొండనుంచి హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చి దాటుకుని అడవిలోకి వెళ్లిపోయింది. ఈ దృశ్యం చూసిన సురేష్‌కు గుండె ఆగినంత పనైంది. తేరుకోవడానికి నిమిషాలు పట్టింది. బైక్ రోడ్డుపైనే నిలిపి ఉండిపోయాడు. అదే సమయంలో కొండపైకి విధులకు వస్తున్న సిబ్బంది ఆనంద్ ఏమైందని ప్రశ్నించగా జాగ్రత్తగా వెళ్లమంటూ హెచ్చరించి పంపి సురేష్ కిందకు వచ్చేశాడు. ఈ విషయాన్ని సురేష్ టూరిజం మేనేజర్ సాల్వీన్‌రెడ్డి దృష్టికెళ్లగా, స్పందించిన ఆయన తక్షణమే అడవిలో నీటి సరఫరా విధులు నిర్వహించే సిబ్బందిని అప్రమత్తం చేశారు. విద్యుత్ సరఫరా విధులు నిర్వహించే మోహన్ బైక్‌పై విధులకు వెళ్తుండగా అధికారులు హెచ్చరించడంతో రాత్రి 10 గంటల సమయంలో కారులో కొండపైకి వెళ్లి సరఫరా సమస్యలు లేవని నిర్ధారించుకొని 11 గంటల తర్వాత తిరిగి కిందకు వచ్చేందుకు ఘాట్‌రోడ్డులో వస్తుండగా మిస్టర్‌బోర్డు వద్ద దగ్గరగా రెండు చిరుతలు రోడ్డు దాటుతూ ప్రత్యక్షమయ్యాయి. వీటిని చూసిన మోహన్ భయాందోళనకు గురై కారులోనే ఉండిపోయాడు. అక్కడినుంచే మేనేజర్ సాల్వీన్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో అప్రమత్తం అయ్యారు. బైక్‌పై ఎవ్వరూ కింద నుంచి పైకి, పైనుంచి కిందకు వెళ్ళవద్దంటూ సూచనలు చేయడంతో సిబ్బంది, స్థానికులు అప్రమత్తమై రాకపోకలు ఆపేశారు.

నాలుగు చిరుతలు

హార్సిలీహిల్స్ అడవిలో నాలుగు చిరుతలున్నట్టు 2013లో నిర్ధారించారు. కొన్నేళ్లుగా స్థానికులు, పర్యాటకులకు ఒక చిరుత మాత్రమే ఎప్పుడో ఒకసారి కనిపిస్తూ వస్తోంది. కోవిడ్ సమయంలో ఒక చిరుత కొండపై స్వేచ్ఛగా సంచరిస్తూ కుక్కలను తినేసేది. బుధవారం రాత్రి వేర్వేరు సమయాల్లో మూడు చిరుతలు కనిపించడంతో ఇక్కడి అడవిలోనే సంచరిస్తున్నట్టు నిర్ధారణ అయ్యింది. దీనిపై అటవీశాఖ ఉన్నతాధికారులు భద్రతా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మహిళల సొమ్ము కాజేసిన ఆర్పీ

న్యాయం చేయాల్సిందిగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు


ఆర్పీ శ్రీదేవి మోసంపై ఫిర్యాదు చేసేందుకు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వచ్చిన మహిళలు

మదనపల్లె : స్వయం సహాయక మహిళా గ్రూపులకు సంబంధించిన డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా, ఆర్పీ సొంతానికి వాడుకుని కాజేసిన వైనంపై మహిళలు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన గురువారం జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా.. పట్టణంలోని పోతులప్పవీధిలో నివాసం ఉంటున్న మహిళలందరూ సమాఖ్యలు ఏర్పాటు చేసుకుని మెప్మా ఆధ్వర్యంలో రుణాలు పొంది, క్రమం తప్పకుండా కంతులు చెల్లించుకుంటూ వచ్చేవారు. ఈ క్రమంలో 17 సమాఖ్యలకు ఆర్పీగా శ్రీదేవి బాధ్యతలు నిర్వహిస్తుండేది. మెప్మా సిబ్బంది కావడంతో సమాఖ్యకు సంబంధించిన లావాదేవీలు, లెక్కజమలు, వడ్డీ లెక్కలు అన్నీ తానే పర్యవేక్షిస్తూ, సంఘాల తరపున బ్యాంకులో చెల్లింపులు చేసేది. దీంతో సంఘాలకు సంబంధించి బ్యాంకులో చెల్లించాల్సిన నగదు ఆమె చేతికే ఇచ్చేవారు. ఆమె సప్తగిరి గ్రామీణ బ్యాంకులో తమ గ్రూపు ఖాతాల్లో జమ చేసేది. మూడేళ్లుగా సభ్యులు ఆర్పీ శ్రీదేవికి చేర్చిన డబ్బులను ఆమె బ్యాంకులో జమచేయకుండా సొంత అవసరాలకు వాడుకుంది. దీంతో తాము బ్యాంకులో తీసుకున్న లోన్లు కట్టకపోవడంతో, బ్యాంకు అధికారులు కొత్త లోన్లు ఇచ్చేందుకు అంగీకరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్పీ శ్రీదేవిని అడిగితే.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తోందని వాపోతున్నారు. ఆర్పీ శ్రీదేవిని విచారించి, తమకు న్యాయం చేయాల్సిందిగా వేడుకున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రోషిణి, ఫర్జానా, షాయ్‌నాజ్, భాను, నజ్మాషిరిన్, జాస్మిన్, శ్వేత తదితరులు ఉన్నారు.

బస్సు కోసం వేచి ఉండగా.. బంగారు గొలుసు లాక్కెళ్లారు


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు లక్ష్మీదేవి, కుటుంబ సభ్యులు

గుర్రంకొండ : బస్సు కోసం వేచి ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లిన సంఘటన మండలంలోని అమిలేపల్లె పంచాయతీ ఎగువ అమిలేపల్లె క్రాస్ వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ పాలెంకొండ గ్రామానికి చెందిన ఎం. రంగప్ప, లక్ష్మీదేవి ల కుమార్తె నరసలతను మండలంలోని అమిపల్లె పంచాయతీ ఎగువ అమిలేపల్లెకు చెందిన సిద్దనారాయణతో వివాహం జరిపించారు. గత బుధవారం రోజు కుమార్తెను చూసేందుకు లక్ష్మీదేవి(55) ఎగువఅమిలేపల్లెకు వచ్చింది. గురువారం ఉదయం తిరిగి తన సొంత గ్రామానికి వెళ్లేందుకు వాల్మీకిపురం బస్సు కోసం అమిలేపల్లె క్రాస్ వద్దకు చేరుకుంది. క్రాస్‌లో బస్సు కోసం వేచి ఉండగా గుర్రంకొండ వైపు నుంచి అవెంజర్ ద్విచక్రవాహనంలో ఇద్దరు దుండగులు వేగంగా వచ్చి లక్ష్మీదేవి మెడలో ఉన్న 43 గ్రాముల బంగారు గొలుసు లాగేశారు. మహిళ కిందపడిపోయినా వదలకుండా బలవంతంగా ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని వేగంగా వాల్మీకిపురం వైపు వెళ్లిపోయారు. చుట్టుపక్కల పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకొంటున్న రైతులు అక్కడికి చేరుకొనే లోపే దుండగులు పారిపోయారు. చోరీకి గురైన బంగారు గొలుసు విలువ రూ. 2.15 లక్షలు ఉంటుందని బాధితురాలు పేర్కొంది. బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకొని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో మొదటి స్థానం



బహుమతి అందుకుంటున్న విద్యార్థి సామతోటి రోహిత్

రాయచోటి : సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ పోటీలలో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి సామతోటి రోహిత్ మొదటి స్థానం సాధించాడు. జనవరి 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆరు రోజులపాటు విజయవాడలోని మురళీ రిసార్ట్‌లో విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం, భారత సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. పోటీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి మొత్తం 210 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ పోటీలలో అన్నమయ్య జిల్లాకు చెందిన విద్యార్థి రోహిత్ వ్యక్తిగత విభాగంలో మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ తాను తయారు చేసిన రేడియో ఫ్రీక్వెన్సీ గుర్తింపు ఆధారంగా పనిచేసే పెట్రోల్ పంప్ అనే ప్రాజెక్టు తనను దక్షిణ భారతదేశ స్థాయి విజేతగా నిలిపిందన్నారు. ఈ ప్రాజెక్టు రూపొందించడంలో గైడ్‌గా చేసిన తమ గురువు రామచంద్ర, ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ శ్రీరామ్ కోటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. సమగ్ర శిక్షణ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డిల చేతుల మీదుగా రూ. 1200లు నగదు బహుమతితోపాటు మెమెంటో, ప్రశంసా పత్రాన్ని రోహిత్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ నాగమణి, సైన్స్ మ్యూజియం క్యూరేటర్ ఉష, మెప్రో, కృష్ణాజిల్లా విద్యాధికారిణి తాహెరా సుల్తానా, రాష్ట్ర నోడల్ అధికారి భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌కు అభినందనలు

చక్కటి ప్రాజెక్టును రూపొందించి అన్నమయ్య జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటిన సామతోటి రోహిత్‌ను, గైడ్ టీచర్ రామచంద్రను జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ కోటేశ్వరరావులు అభినందించారు.

ప్రాణం తీసిన ‘చిల్లర’ గొడవ


మృతుడు చాంద్‌బాషా (ఫైల్)


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ ఎన్.శేఖర్

మదనపల్లె : పది రూపాయల నోటు తీసుకుని, రెండు ఐదు రూపాయల నాణేలు ఇవ్వమని అడిగితే....లేదని నిరాకరించినందుకు ఇద్దరు యువకులు దుకాణదారుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిస్తే.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందాడు. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదుచేసి నిందితులను అరెస్ట్ చేసిన ఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తపల్లె పంచాయతీ భవానీనగర్‌లో చాంద్‌బాషా(60) చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో జనవరి 23వతేదీ రాత్రి 9 గంటల సమయంలో అదే ప్రాంతానికి చెందిన షబ్బీర్, షాజహాన్ దుకాణం వద్దకు వెళ్లి సిగరెట్లు కొనుగోలు చేశారు. తర్వాత పదిరూపాయల నోటు ఇచ్చి రెండు ఐదు రూపాయల నాణేలు ఇవ్వాల్సిందిగా కోరారు. దీనికి చాంద్‌బాషా తన వద్ద చిల్లర లేదని చెప్పడంతో యువకులు ఇద్దరూ వాగ్వాదానికి దిగి దాడిచేశారు. ఘటనలో చాంద్‌బాషా తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చాంద్‌బాషా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దాడి కేసును హత్యకేసుగా మార్పుచేసి, నిందితులు షబ్బీర్, షాజహాన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు.

ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న మహిళపై ఫిర్యాదు

మదనపల్లె : ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటుండగా, ఓ మహిళ అడ్డుతగులుతూ, తమపై దౌర్జన్యానికి పాల్పడుతోందని బాధితుడు గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని బీకే పల్లె వైఎస్సార్ కాలనీలో సర్వే నంబర్ 546, 547, 514 పార్టు, 440 పార్టు పైకి ప్లాట్ నంబర్.124ను షేక్ రజియా పేరుమీద 2008లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ పట్టా మంజూరుచేసిందన్నారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు కట్టుకోలేని తాము, తర్వాత ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తుండగా, స్థానికంగా ఉన్న ఈశ్వరమ్మ అడ్డుకుంటోందన్నారు. స్థలం తనదని చెబుతూ, తమపై దౌర్జన్యానికి పాల్పడుతోందని, డాక్యుమెంట్లు చూపించమని కోరితే..తన వద్ద లేవని, ఇంటిస్థలం మాత్రం తమదేనని గొడవ పెట్టుకుంటోందన్నారు. తమకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలం తప్ప వేరే ఆస్తులు లేవని, ఈశ్వరమ్మను విచారించి, తమకు న్యాయం చేయాల్సిందిగా బాధితుడు ఎస్ఐకి ఫిర్యాదు చేశాడు.



అన్ని వసతులతో సొంతిల్లు కట్టుకున్నాం



గతంలో వసతులు లేనిపూరి కొట్టంలో అగ్నికి, వర్షానికి భయపడుతూ జీవనం సాగించేవాళ్లం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత మాకు పక్కా గృహం మంజూరైంది. ప్రభుత్వం విడుదల చేసిన రూ.1.80 లక్షలకు మా కష్టం తోడుచేసి వంటగది, బెడ్‌రూమ్, మరుగుదొడ్లు అన్ని వసతులతో సొంతిల్లు కట్టుకున్నాము. పేదల సంక్షేమం కోసం జగనన్న ముఖ్యమంత్రి అయ్యారు. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాము.
– ఒరుపల్లి పద్మావతి, మైనలపల్లి, గొల్లపల్లి, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా

మళ్లీ జగనన్నే సీఎం కావాలి



నేను ఒంటరి మహిళను. ఆఫీసులకెళ్లి ఏదైనా సర్టిఫికెట్ తెచ్చుకోవాలంటే చాలా కష్టంగా ఉండేది. జగనన్న సురక్ష పథకంలో నాకు అవసరమైన కుల, ఆదాయ సర్టిఫికెట్లు వలంటీర్ ఇంటికే తెచ్చి ఇచ్చాడు. అలాగే నాకు వైఎస్సార్ పింఛన్ కానుక వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు వస్తున్నాయి. వీటితో ఆర్థిక కష్టాలు తొలగిపోయి సంతోషంగా జీవిస్తున్నాను. ఇదంతా జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత సాధ్యమైంది. మాలాంటి పేదలకోసం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.
– కె.కాంతమ్మ, అరుంధతివాడ, చెర్లోపల్లి గ్రామం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా

మన బడి నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి




సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా ఉంటున్నాయి. మనబడి నాడు–నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో కూడా లేని విధంగా సౌకర్యాలు కల్పించారు. మైదుకూరు మండలం వనిపెంట జెడ్పీ హైస్కూల్‌లో నాడు–నేడు మొదటి దశ, రెండో దశలలో కలిపి రూ.66 లక్షలతో పనులు చేపట్టారు. ఈ నిధులతో అదనపు తరగతి గదులు, పిల్లలకు శుద్ధి నీటిని అందించేందుకు ఆర్‌ఓప్లాంట్, చక్కటి టాయిలెట్స్, పాత భవనాలకు మేజర్ మరమ్మతులు, విద్యుదీకరణ, పెయింటింగ్, డ్యూయల్ డెస్కులు వంటివి పాఠశాలలకు సమకూరాయి. దీంతో పాఠశాల సర్వాంగ సుందరంగా మారింది. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది.
– మేకల గురయ్య, హెడ్మాస్టర్, జెడ్పీ హైస్కూల్, వనిపెంట, మైదుకూరు మండలం.

మదనపల్లె డీఎస్పీ బదిలీ

మదనపల్లె సిటీ : మదనపల్లె డీఎస్పీ కేశప్ప బదిలీ అయ్యారు. ఆయనను విజయవాడ డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం అర్బన్ నుంచి ప్రసాద్‌రెడ్డిని మదనపల్లెకు బదిలీ చేశారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

108 వాహనంలో ప్రసవం



నిమ్మనపల్లె : ఆరోగ్య అత్యవసర సమయాల్లో ఆపద్బాంధవిగా సేవలందిస్తున్న 108 వాహనం పండంటి బిడ్డ జన్మించేందుకు పాన్పు అయింది. మండలంలోని తవళం పంచాయతీ చౌకిల్లవారిపల్లికి చెందిన సయ్యద్ బాషా భార్య తంసమ్ (23) కు గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం అందించారు. ఈఎంటీ రెడ్డి జస్వంత్, పైలెట్ అమరనారాయణ, వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆమెను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో ప్రసవానంతర చికిత్స కోసం వారిని జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు.